రేపు పిల్లల ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మెంటేవారితోట పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో చిన్న పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం మంగళవారం నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఛైర్మన్ బి.బలరాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపు రెగ్యులర్‌గా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి నెలా 4వ మంగళవారం జరుగుతోందని తెలిపారు. ఈ క్యాంపులో ఉచితంగా 2డి ఎకో పరీక్ష నిర్వహించి వంద మంది వరకూ గుండె సమస్యల గల పిల్లలను గుర్తించి మెరుగైన శస్త్ర చికిత్సలు చేశామని తెలిపారు. ఈ శిబిరం ద్వారా ఉచితంగా గుండె వైద్య సేవలు అందిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు.

సమగ్రాభివృద్ధి వైపు అడుగులు

76వ గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ నాగరాణి

ఉత్తమ సేవలందించిన 321 మందికి అవార్డుల ప్రదానం

పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న కలెక్టర్ నాగరాణి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో సుస్థిర అభివృద్ధి, సంక్షేమానికి ప్రణాళిక రూపొందించి సమగ్రాభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కలెక్టరేట్ పెరేడ్ ప్రాంగణంలో 76వ గణతంత్ర వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. కలెక్టర్ నాగరాణి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సాయుధ దళాల గౌరవం స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రగతిపై కలెక్టర్ నాగరాణి ప్రసంగించారు. ఘన చరిత్ర కలిగిన గణతంత్ర వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లోనూ జిల్లాలో సమగ్రంగా అమలు చేసేందుకు అందరి సహకారంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ముఖ్యంగా రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతన్నకు అన్నివిధాలా ప్రభుత్వ వెన్నుదన్నుగా నిలుస్తోందన్నారు. ప్రస్తుత రబీ సీజన్లో 15,031 మంది కవులు రైతులకు రూ.73 కోట్ల రుణాలు అందించామన్నారు. 64,954 మంది రైతుల నుంచి 4.15 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి రూ.950 కోట్లు రైతుల ఖాతాలో జమ చేశామన్నారు. రూ.కోటీ 40 లక్షలతో 1356 హెక్టార్లలో 1,392 మంది రైతులకు ఆయిల్ ఫామ్‌కు ప్రోత్సహించినట్లు తెలిపారు. 16.94 కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంత పరిధిలో 43,776 హెక్టార్ల విస్తీర్ణంలో ఆక్వా సాగు జరుగుతోందన్నారు. దేశంలోనే ఆక్వా ఉత్పత్తుల్లో ముందంజలో ఉన్నామన్నారు. 10 ఎకరాల్లోపు ఆక్వా రైతులకు సబ్సిడీపై విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 1,423 పాఠశాలల్లో 96,458 మంది చిన్నారులు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని స్వీకరిస్తున్నారన్నారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా 2055 మంది రోగులకు పౌష్టికాహారానికి నెలకు 1000 చొప్పున ఏడాదికి రూ. కోటి 23 లక్షల 30 వేలు చెల్లించామన్నారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి అహర్నిశలూ కృషి చేస్తున్న జిల్లా జాయింట్ కలెక్టరు, అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలో శాంతిభద్రతలు పరిరక్షణకు అవిశ్రాంతంగా శ్రమిస్తున్న జిల్లా ఎస్‌పి, పోలీస్ యంత్రాంగానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు, ఉభయగోదావరి జిల్లాల టీచర్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి, డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా ఎఎస్‌పి వి.భీమారావు, ఆర్‌డిఒలు, డిఎస్‌పిలు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

దేశ భక్తిని, జాతీయ భావాన్ని రగిల్చేలా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాలకొల్లు భారతి విద్యా భవన్, తణుకు జెడ్‌పి హైహైస్కూల్, భీమవరం పిఎస్‌ఎం బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు చేపట్టిన నృత్య ప్రదర్శనలు విశేషంగా అలరించారు. భీమవరం విష్ణు ఇంగ్లీష్ మీడియం స్కూల్, జెడ్‌పిహెచ్‌ఎస్ మోగల్లు హైస్కూల్, ఎల్‌బిచర్ల హైస్కూల్ విద్యార్థుల ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. తణుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల బృందం ప్రథమ, పాలకొల్లు భారతీయ విద్యా భవన్ విద్యార్థుల బృందం ద్వితీయ, భీమవరం పిఎస్ఎస్ గర్ల్స్ మున్సిపల్ హైస్కూల్ బృందం తృతీయ బహుమతులు గెలుచుకున్నాయి.

విద్యార్థినుల ప్రదర్శన

అభివృద్ధిని ప్రతిబింబించేలా శకటాల ప్రదర్శన

ప్రగతిని ప్రతిబింబించేలా శకటాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్య, వైద్య ఆరోగ్య, పశుసంవర్ధక, మత్స్య, విద్యుత్, జిల్లా గ్రామీణ అభివృద్ధి, ఉద్యానవన, అగ్నిమాపక, వ్యవసాయ శాఖలు అభివృద్ధి కార్యక్రమాల సమాచారాన్ని ప్రదర్శిస్తూ శకటాలను ఏర్పాటు చేశాయి. విద్యా శాఖకు ప్రథమ, వ్యవసాయ శాఖకు ద్వితీయ, పశుసంవర్ధక శాఖ తృతీయ బహుమతులు అందుకున్నారు.

ఆకర్షణగా నిలిచిన స్టాల్స్

వివిధ శాఖలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఉద్దేశిస్తూ ఏర్పాటుచేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. మత్స్యశాఖ, వైద్య ఆరోగ్య, వ్యవసాయ, ఉద్యానవన, మహిళా అభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, అగ్నిమాపక శాఖ, మెప్మా, జిల్లా గ్రామ పంచాయతీ శాఖ, రీసర్వే ప్రాజెక్టు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, పరిశ్రమల శాఖ, అటవీ శాఖ, చేనేత జౌళి శాఖలు మొత్తం 18 స్టాల్స్ ఏర్పాటు చేశారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రథమ, మత్స్యశాఖ ద్వితీయ బహుమతిని, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ తతీయ బహుమతిని గెలుచుకున్నాయి.

321 మందికి అవార్డులు, ప్రశంస పత్రాలు ప్రదానం

జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులతో పాటు పలు రంగాల్లో సేవలందించిన సంఘ సంస్కర్తలు, స్వాతంత్ర సమరయోధులను కలెక్టర్ చదలవాడ నాగారాణి ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. సుమారు 321 మందికి అవార్డులు, పత్రాలు అందజేశారు. జిల్లా సమాచార శాఖ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను కలెక్టరు చదలవాడ నాగరాణి, ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ, జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి చేతులు మీదుగా అందజేశారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించినందుకు గాను జిల్లా సమాచార శాఖ ఉద్యోగులు సీనియర్ అసిస్టెంట్ కెటిఎంకెఎన్ సత్యనారాయణ రాజు, టెక్నికల్ సబార్డినేటు పి.వీరభద్రం ప్రశంశా పత్రాలను అందుకున్నారు. అలాగే డిపిఆర్‌ఒ టి.నాగేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు. కవాతు ప్రదర్శనలో కడగట్ల గురుకుల పాఠశాల విద్యార్థులు స్కాట్లాండ్ బ్యాగ్ పైప్ బ్యాండ్ బృందం ప్రదర్శనకు ప్రత్యేక అవార్డుఅందుకున్నారు.

ఆకట్టుకున్న వ్యవసాయ శాఖ శకటం

జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల

దేశాన్నిబలమైన శక్తిగా తయారు చేస్తాం : నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

గత జగన్ ప్రభుత్వం నిరంకుశం, నియంతృత్వం, కక్షలు, వేధింపులు, అక్రమ కేసులు, విధ్వంసం వంటివి బ్రిటీష్ పాలనను తలపించాయని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లులో మంత్రి కార్యాలయం వద్ద ఆదివారం ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2047 స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యం సాధించాలంటే జగన్ విధ్వంస పాలన రాదనే సందేశం పారిశ్రామిక వేత్తలకు కలిగించాలని కోరారు. గత పాలనలో గణతంత్ర స్ఫూర్తికి తూట్లు పొడిచి అన్ని వ్యవస్థలనూ తన రాజకీయ స్వార్థానికి వాడుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం దేశాన్ని ప్రపంచంలోనే బలమైన శక్తిగా తయారుచేస్తోందని చెప్పారు.

ఉత్తమ సేవలకు పురస్కారాలు

కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు



డిఆర్‌డిఎ పీడీ వేణుగోపాల్



అగ్రికల్చర్ జెడి వెంకటేశ్వరరావు



ఐసిడిఎస్ పీడీ సుజాతారాణి

డిపిఒ అరుణశ్రీ

సివిల్ సప్లయిస్ అధికారి సరోజ

డ్వామా పీడీ అప్పారావు



సమాచార శాఖ ఎడి నాగేశ్వరరావు

అడిషనల్ ఎస్‌పి బీమారావు



రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వరరావు

క్షయ, కుష్టు వ్యాధుల నిర్మూలనే లక్ష్యం

- గ్రామస్థాయిలో విస్తృతంగా వైద్య పరీక్షలు
- హెచ్ఎంపివి వైరస్‌పై అపోహలు వద్దు
- 2 లక్షల మందికి కేన్సర్ టెస్టులు చేసి 700 మంది అనుమానితులుగా గుర్తింపు
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.భానునాయక్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో క్షయ, కుష్టు వ్యాధుల నిర్మూలనే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.భానునాయక్ తెలిపారు. ఈ వ్యాధుల నిర్మూలనకు గ్రామస్థాయిలో విస్తృతంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి లక్ష మందిలో 3 వేల మందికి పరీక్షలు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ సుమారు రెండు లక్షల మందికి కేన్సర్ టెస్టులు చేశామని, వారిలో 700 మందిని కేన్సర్ అనుమానితులుగా గుర్తించామని తెలిపారు. జిల్లా ప్రజానీకానికి ప్రబలుతున్న వ్యాధులు, వైద్య ఆరోగ్య శాఖ అందిస్తున్న వైద్య సేవలు, గర్భిణులకు సులభ ప్రసవాలు, క్షయ, కుష్టు వ్యాధుల నిర్మూలన, కేన్సర్ టెస్టులు, ల్యాబ్‌లో నిర్వహణ, పిహెచ్‌సిల ద్వారా అందుతున్న సేవలు వంటి అంశాలపై డిఎంహెచ్‌ఒ భానునాయక్ ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.

ప్రశ్న : జిల్లాలో క్షయ నిర్మూలనకు ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

జిల్లాలో క్షయ నిర్మూలనకు అన్ని చర్యలూ తీసుకున్నాం. గతేడాది క్షయ వ్యాధి నిర్మూలనకు జాతీయస్థాయిలో జిల్లాకు సిల్వర్ మెడల్ కూడా వచ్చింది. గతేడాది ప్రతి లక్ష మందిలో 2500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించాం. ఈ ఏడాది లక్ష మందిలో సుమారు 3 వేల మందికి పరీక్షలు చేసేందుకు చర్యలు చేపట్టాం. జిల్లా వ్యాప్తంగా 19 ప్రాంతాల్లో 21 ట్రూ నాట్ మిషన్లు, సిబి టెట్లు రెండు అందుబాటులో ఉంచడం జరిగింది.

ప్రశ్న : లెప్రసీ కేసుల నమోదు ఎలా ఉంది, నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టారు?

10 వేల మందికి వైద్య పరీక్షలు చేస్తే ఒక కేసు కూడా కాలేదు. లెప్రసీ నివారణకు అన్ని చర్యలూ తీసుకున్నాం. ప్రస్తుతం లెప్రసీ వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలు, పరీక్షలు ఉచితంగా అందిస్తున్నాం. ఏటా రెండు సార్లు లెప్రసీ పరీక్షలు చేస్తున్నాం.

ప్రశ్న : వైరల్ జ్వరాల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రతి శుక్రవారమూ ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా చేస్తున్నాం. సుమారు 1400 మంది ఆశా కార్యకర్తలు ఇంటింటా ఫీవర్ సర్వే చేస్తున్నారు. వైరల్ జ్వరాల బారిన వారికి వైద్యసేవలందించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుంది. అలాగే గ్రామస్థాయిలో వైరల్ జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకూ సర్వే జరుగుతుంది.

ప్రశ్న : జిల్లాలో హెచ్ఎంపివి కొత్త వైరస్ జాడలు ఏమైనా ఉన్నాయా?

హెచ్ఎంపివి కొత్త వైరస్‌పై అందరికీ అనేక అనుమానాలున్నాయి. జిల్లాలో ఈ వైరస్ జాడలు ఎక్కడా లేవు. అయినా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని అప్రమత్తం చేశాం. తణుకు జిల్లా ఆస్పత్రిలో 20 పడకలను సిద్ధంగా ఉంచాం.

ప్రశ్న : జిల్లా ప్రజానీకం కేన్సర్ బారిన పడుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. జిల్లాలో పరిస్థితి ఎలా ఉంది. ఏటువంటి సేవలు అందిస్తున్నారు.

గతేడాది నవంబర్ 14 నుంచి జిల్లా అంతటా స్క్రీనింగ్ టెస్టులు చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 14 లక్షల మందికి కేన్సర్ టెస్టులు చేయాల్సి ఉంది. ఇప్పటివరకూ సుమారు రెండు లక్షల మందికి టెస్టులు చేశాం. వారిలో 700 మందిని కేన్సర్ అనుమానితులుగా గుర్తించాం. రోజుకు ఐదు ఇళ్లను సందర్శించి టెస్టులు చేస్తున్నాం. ఈ టెస్టులు రానున్న రోజుల్లో కూడా కొనసాగుతాయి.

ప్రశ్న : సాధారణ ప్రసవాలు జరిగేందుకు ఏం చర్యలు తీసుకున్నారు. ప్రతినెలా ఎన్ని సులభ ప్రసవాలు జరుగుతున్నాయి. ఆపరేషన్లు ఎన్ని జరుగుతున్నాయి?

జిల్లా వ్యాప్తంగా 32 పిహెచ్‌సిలు ఉన్నాయి. అన్ని కేంద్రాల్లో సులభ ప్రసవాలు చేసేందుకు చర్యలు తీసుకున్నాం. ముఖ్యంగా గర్భిణులకు సులభ ప్రసవాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఏటా వంద నుంచి 150 వరకూ పిహెచ్‌సిల్లో సులభ ప్రసవాలు జరుగుతున్నాయి. ప్రయివేటు ఆసుపత్రుల్లో జరిగే ప్రసవాల ఆపరేషన్లకు సంబంధించి ఆడిట్ రిపోర్టు తీసుకోవడం జరుగుతుంది. జిల్లా వ్యాప్తంగా 60 శాతం ఆపరేషన్లు జరిగే స్థితి నుంచి తగ్గించుకుంటూ సులభ ప్రసవాలు పెంచేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం.

ప్రశ్న : అనుమతుల్లేకుండా రక్త పరీక్షల ల్యాబ్‌లు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఏమైనా ఫిర్యాదులు అందయా, ఏం చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లాలో అనుమతులు లేకుండా రక్త పరీక్షా కేంద్రాలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదు. ఒకవేళ నిర్వహిస్తే ఫిర్యాదు ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : మదర్ మిల్క్ బ్యాంకులు ఎన్ని ఏర్పాటు చేశారు?

రాష్ట్రంలో ఎక్కడా మదర్ మిల్క్ బ్యాంకులు లేవు. మొట్టమొదటిసారిగా ఈ జిల్లాలోనే మిల్క్ బ్యాంకులు ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లాలో 8 చోట్ల మదర్ మిల్క్ బ్యాంకులు ఏర్పాటు చేశాం. మిల్క్ సేకరణకు అన్ని చర్యలూ చేపట్టాం. రాబోయే రోజుల్లో మదర్ మిల్క్ బ్యాంకుల ద్వారా ఎంతోమంది చిన్నారులకు పాలు అందించేందుకు ఏర్పాటు చేశాం.

ప్రశ్న : జిల్లాలో ప్రభుత్వ డయాలసిస్ సెంటర్లు ఎన్ని ఉన్నాయి. రానున్న రోజుల్లో ఎన్ని ఏర్పాటు చేయనున్నారు?

ఆకివీడు సిహెచ్‌సిలో ప్రభుత్వ డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశాం. ఇక్కడ దాతల సహకారంతో మూడు డయాలసిస్ మిషన్లు అందుబాటులో ఉంచాం. జిల్లా వ్యాప్తంగా అన్ని సిహెచ్‌సిల్లో డయాలసిస్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న : జిల్లా ఆసుపత్రి నిర్మాణ పనులు ఏ విధంగా సాగుతున్నాయి?

జిల్లా ఆసుపత్రి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. త్వరలో పనులు కూడా పూర్తికానున్నాయి. ప్రస్తుతమున్న ఆసుపత్రులను మరింత అభివృద్ధి చేసి ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సదుపాయాలందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం.

ప్రశ్న : పిహెచ్‌సిల్లో కొత్తగా ఏం అమలు చేస్తున్నారు? ఎటువంటి సౌకర్యాలు కల్పించారు?

ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫోర్త్ స్ట్రక్చర్ అమలు చేస్తున్నాం. ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, సూపర్‌వైజర్లు కలిపి మొత్తం 14 మంది నిరంతరం వైద్య సేవలందించే విధంగా చర్యలు చేపట్టాం.

ప్రశ్న : వైద్యులు, మెడికల్ ఆఫీసర్లు, ఎఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది కొరత ఉందా?

ఎటువంటి కొరత లేదు. ప్రస్తుతం అన్ని పిహెచ్‌సిల్లో ఫోర్త్ టెక్చర్ అమలు జరుగుతోంది. వైద్యులతో పాటు ఇతర సిబ్బంది అందుబాటులోనే ఉంటున్నారు. రోగులకు ఏ సమస్య వచ్చినా వైద్య సేవలందిస్తున్నారు.

బడ్జెట్ సమావేశాల్లో ప్రజలపై భారాలు వేయొద్దు

సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ర్యాలీలు, నిరసన

భీమవరం : మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు బలరాం

ప్రజాశక్తి - భీమవరం

రాబోయే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ప్రజలపై భారాలు వేయబోమని బిజెపి మోడీ ప్రభుత్వం ప్రకటించాలని రైతు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు బి.బలరాం డిమాండ్ చేశారు. ప్రభుత్వ, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టాలని చూస్తే ఊరుకునేది లేదని ఎపి రైతు సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు బి.బలరాం డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో విస్సాకోడేరు రైస్‌మిల్ సెంటర్ నుంచి భీమవరం ప్రకాశంచౌక్ వరకూ ట్రాక్టర్, బైక్ ర్యాలీ చేసి సభ నిర్వహించారు. ఈ సభకు సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ ఆకుల హరేరామ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చాక నిత్యావసర వస్తువులపై భారాలు మోపారని విమర్శించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు, ఆల్ ఇండియా అగ్రగామిక కిసాన్ సభ జిల్లా అధ్యక్షులు లంకా కృష్ణమూర్తి మాట్లాడుతూ అదానీతో కుదుర్చుకున్న స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాజు మాట్లాడుతూ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతుల సమస్యల పరిష్కార విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీనమేషాలు వేస్తున్నాయన్నారు. తొలుత విస్సాకోడేరు రైస్ మిల్ సెంటర్లో జాతీయ పతాకాన్ని కిలారి తవిటి నాయుడు ఆవిష్కరించారు. రాజ్యాంగ ప్రవేశిక ప్రతిజ్ఞను చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కలిదిండి గోపాల రాజు, శేషపు అశ్రియ్య, ఇంజేటి శ్రీనివాసరావు, డి.త్రిమూర్తులు, బంగారు వరలక్ష్మి, బి.గణేష్, చల్లబోయిన వెంకటేశ్వరరావు, బొర్రా అలమహారాజు పాల్గొన్నారు.

నరసాపురం: దేశంలో బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ అన్ని పంటలకూ కనీస మద్దతు ధర నిర్ణయించాలని, లేబర్ కోడ్లు ఎత్తి వేయాలని కేంద్ర రైతు కార్మిక సంఘాల పిలుపులో భాగంగా మండలంలోని కొప్పర్రు, లిఖితపూడి, సరిపల్లి మీదుగా నరసాపురం వరకూ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కవురు పెద్దిరాజు, కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, దిగుపాటి రాజగోపాల్, సిఐటియు నాయకులు ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడారు. (కార్యక్రమంలో నాయకులు కె.బాలరాజు, జె.శ్రీనివాసు, టి.సత్యనారాయణ, జి.శ్రీరామచంద్రుడు, జె.రామ్మోహనరావు, కె.శ్రీనివాస్, సిహెచ్.వీరబాబు, పి.పేరంటాల నాయుడు, జి.నాగేశ్వరరావు, ఎం.నీలకంఠ, డి.సుధాకర్, పి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : రైతు పండించిన అన్ని రకాల పంటలకూ గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెంటపాడు, తాడేపల్లిగూడెం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెంటపాడు గాంధీ బొమ్మ సెంటర్ నుంచి స్థానిక తహశీల్దార్ కార్యాలయం వరకూ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి, పెంటపాడు మండల కన్వీనర్ సిరపరపు రంగారావు, సిఐటియు గూడెం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జవ్వాది శ్రీను, శిద్దిరెడ్డి శేషు, పెనగంటి దుర్గ, పోతు శ్రీను, గొర్రెల సతీష్, యడవల్లి వెంకట దుర్గారావు, పతివాడ నాగేంద్రబాబు, దత్తు రాము, బర్ల బాలాజీ, ఎం.శ్రీను పాల్గొన్నారు.

ఆకివీడు : దేశానికి అన్నం పెట్టే రైతులను కాపాడాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్ అన్నారు. ఆదివారం భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టియు కార్యాలయం నుంచి దుంపగడప రోడ్డు, మంచినీటి చెరువు, పాత బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించి అక్కడ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్.రామ్మోహన్ మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కాపాడాలని, గిట్టుబాటు ధరలు కల్పించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు తోట రామకృష్ణ, రమేష్, అంజి, వెంకటేశ్వర్లు, లక్ష్మి పాల్గొన్నారు.

తణుకు : మోడీ ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలు రద్దు చేయకపోతే పోరాటం సాగిస్తామని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ హెచ్చరించారు. స్థానిక బ్యాంకు కాలనీలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన, ధర్నా నిర్వహించారు. తొలుత జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు అడ్డగర్ల అజయకుమారి, కామన మునిస్వామి, గార రంగారావు, ఎం.రమేష్, సిహెచ్ రామకృష్ణ, హర్షవర్ధన్, నరేష్, శర్మ, మోహన్‌రావు, శివకుమార్, మహేష్, నారాయణ, గణేష్, విజయకుమార్ పాల్గొన్నారు.

ముగిసిన బాలోత్సవం

బహుమతులు అందజేస్తున్న ప్రముఖ వైద్యులు హుస్సేన్‌అహ్మద్

ప్రజాశక్తి - తణుకు

గత రెండు రోజుల నుంచి ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగిన బాలోత్సవాల్లో 50కి పైగా పాఠశాలల నుంచి సుమారు 2500 మందికి పైగా విద్యార్థులు 45 రకాల అకడమిక్, కల్చరల్ ఈవెంట్స్‌తో ప్రతిభ చాటుకున్నారు. ప్రథమ, ద్వితీయ బహుమతులతో పాటు సుమారు 300 సర్టిఫికెట్లతో పాటు మెమెంటోలు, మెడల్స్ విజేతలకు, విచ్చేసిన అతిథులకు అందజేశారు. బిఎం.గోపాల్‌రెడ్డి చేసిన మాజిక్ షో, పిల్లలు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాంకేతిక విజ్ఞానం పెరగడం వల్ల ఈ తరం బాల బాలికలు జ్ఞానంతో, ఉత్సాహంతో ఉన్నారని బాలోత్సవం నిర్వహణ కమిటీ అధ్యక్షులు హుస్సేన్ అహ్మద్ అన్నారు. ఆదివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బాలోత్సవం ముగింపు సభ, బహుమతి ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా హుస్సేన్ అహ్మద్ మాట్లాడుతూ అందరం మంచి పౌరులుగా పిల్లల్ని తీర్చిదిద్దాలని, భవిష్యత్తులో దేశానికి మంచిగా ఉపయోగపడాలని బాలోత్సవ కమిటీ సభ్యులు ఎప్పటి నుంచో ఆలోచిస్తున్నారన్నారు. ఆ కమిటీలో తాను కూడా భాగం పంచుకున్నందుకు గర్వంగా ఉదన్నారు. విద్యార్థుల్లో దాగిన్న సృజనాత్మక శక్తులను వెలికితీసి, అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని ఈ బాలోత్సవాలు వ్యక్తం చేస్తున్నాయని, భవిష్యత్తులో మరింతగా ఇటువంటి సంబరాలు జరుపుకోవాలని తెలిపారు. మానవత అధ్యక్షులు గమిని రాంబాబు మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకత ఉంటుందని తెలిపారు. విద్యార్థుల్లో ఎవరికి ఏ ప్రతిభ ఉందో కేవలం ఆ ఉపాధ్యాయులకు మాత్రమే తెలుస్తుందన్నారు. రూట్స్ డైరెక్టర్ బి.విద్యాకాంత్ మాట్లాడుతూ. బాల బాలికల్లో సృజనాత్మకతను వెలికి తీయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బాలోత్సవం పిల్లల భవిష్యత్తుకు పునాదిలా ఉపయోగపడుతుందన్నారు. బాలోత్సవ నిర్వహణ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పిఎల్ నర్సింహారావు, పి.దక్షిణామూర్తి మాట్లాడుతూ రెండు రోజుల పాటు తణుకులో జరిగిన బాలోత్సవం పిల్లల్లో ఎంతో ఉత్సాహపూరిత వాతావరణం నింపిందన్నారు. బాలోత్సవం నిర్వహణకు పలు ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థలు వెన్నుతట్టి యాజమాన్యాలు సహాయ సహకారాలు అందజేశాయని, అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జె.చంద్రప్రసాద్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.పద్మావతి, బాలోత్సవం ట్రెజరర్ ఎఎస్‌వి.శేషుబాబు, యర్రా రాజ్యలక్ష్మి, బళ్ల చిన వీరభద్రరావు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న దళిత నేతలు

లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

మతోన్మాద, కులోన్మాద దాడులను ఐక్యంగా తిప్పికొట్టాలి

కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బలరాం

భీమవరం : భారత లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కెవిపిఎస్, దళిత, ప్రజా సంఘాల నేతలు నినదించారు. ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్, దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో అన్ని దళిత ప్రజా సంఘాలతో నిర్వహించిన కార్యక్రమానికి కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు అధ్యక్షత వహించారు. దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం వంటి అత్యున్నత గ్రంథాన్ని దేశానికి అందించిన అంబేద్కర్‌ను కులానికి మాత్రమే పరిమితం చేస్తున్నారన్నారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.బలరాం మాట్లాడుతూ దేశంలో మతసామరస్యానికి విఘాతం కల్పించేలా మతోన్మాద శక్తులు, సంఘ్ పరివార్ శక్తులు పెట్రేగిపోతున్నాయని మండిపడ్డారు. వీటిని ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా రాష్ట్ర కార్యదర్శి కోనా జోసెఫ్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఫొటోను కరెన్సీ నోట్లుపై ముద్రించాలని డిమాండ్ చేశారు. ఎన్‌సిసి క్యాడెట్ కెప్టెన్ డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ దేశంలో లౌకిక రాజ్యాంగం ద్వారానే పేద, బడుగు బలహీనవర్గాలకు విద్య అందుతుందన్నారు. అడ్వకేట్ బడుగు అశోక్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగ విశిష్టత ప్రజలందరూ తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దూసి కళ్యాణి మాట్లాడుతూ అంబేద్కర్ కొందరి వాడు మాత్రమే కాదని అందరి వాడని అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, జిల్లా సహాయ కార్యదర్శి మాదాసి గోపి, ఎస్‌సి, ఎస్‌టి వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అమూల్య రావు, రాజబాబు, దళిత సంఘాల నేతలు ఈది రవికుమార్ పాల్గొన్నారు.

ఉండి : మండలంలోని పాందువ్వ గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు జరిగాయి. కెవిపిఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపి అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతూ కెవిపిఎస్‌గా గ్రామాల్లో, దళితపేటలో మంచినీరు, డ్రెయినేజీ, ఇల్లు, ఉపాధి, నిర్మాణం, మౌలిక సదుపాయాలు రాజ్యాంగంలో పొందుపరిచిన రాజ్యాంగ ఫలాలు అందరికీ అందేలా ప్రభుత్వం అధికారికంగా చేపట్టాలని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎం.ప్రశాంత్, డి.దుర్గాప్రసాద్, ఎం.రామయ్య, డి.గోపాలం, రామకృష్ణ, నాగేశ్వరరావు, జి.యోహాను, కాసులు, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రసాద్ ప్రతిభకు అవార్డుల పట్టం

రెండున్నరేళ్లలో ఆరుసార్లు జిల్లా అధికారిగా అవార్డులు

28 ఏళ్ల సర్వీసులో 22 సార్లు అవార్డులు అందుకున్న సివిల్ సప్లయిస్ అధికారి

అవార్డు అందుకుంటున్న శివప్రసాద్

ఏలూరు ప్రతినిధి: జిల్లాకు వచ్చిన రెండున్నరేళ్ల కాలంలో ఆరుసార్లు జిల్లా కలెక్టర్, మంత్రుల చేతుల మీదుగా అవార్డు అందుకున్న పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ టి. శివప్రసాద్ ప్రతిభ ప్రస్తుతం అంతటా చర్చనీయాంశంగా మారింది. పశ్చిమగోదావరి జిల్లా అంటే వరిసాగుకు పెట్టింది పేరు. ధాన్యం కొనుగోలు సమయంలో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌కు నిత్యం సవాళ్లు ఎదురవుతుంటాయి. సంచుల కొరత, తేమశాతం, ధాన్యం సొమ్ము జమ ఇలా అనేక సమస్యలను జిల్లా మేనేజర్ ఓపిగ్గా పరిష్కరించుకుంటూ ముందుకు సాగాలి. ఈ పనిని తన ప్రతిభతో కిందిస్థాయి అధికారులను కలుపుకుని, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ ధాన్యం కొనుగోలును సాఫీగా సాగించడంలో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ టి.శివప్రసాద్ అందరి మన్ననలను పొందారని చెప్పొచ్చు. ఈయన 2022 జులై మొదటివారంలో పశ్చిమగోదావరి పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆరుసార్లు ఆగస్టు15కు, రిపబ్లిక్ డేకు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఆయన 28ఏళ్ల ఉద్యోగ సర్వీసులో 22 అవార్డులతోపాటు, అనేక స్పెషల్ జ్యూరీ అవార్డులను సైతం అందుకోవడం గమనార్హం.

ఉచిత మెగా కేన్సర్ వైద్య శిబిరం ప్రారంభం

భీమవరం టౌన్ : భీమవరం ఆనంద ఫంక్షన్ హాల్లో ఉద్దరాజు ఆనంద రాజు ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరం, ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్ష శిబిరం, ఉచిత చర్మ సంబంధిత వ్యాధుల శిబిరాలను రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) ఆదివారం ప్రారంభించారు. ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ కేన్సర్ నిర్ధారణ పరీక్ష ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కేన్సర్‌పై అవగాహన ఎంతో అవసరమని, ముందుగానే కేన్సర్‌ను గుర్తిస్తే చికిత్స అందించవచ్చునని అన్నారు. ప్రముఖ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ అల్లూరి వంశీకృష్ణ, చర్మ వ్యాధుల నిపుణులు డాక్టర్ ప్రియాంక వర్మ మాట్లాడారు. అనంతరం సుమారు 1600 మంది వైద్య పరీక్షలను నిర్వహించుకున్నారు. పొత్తూరి బాపిరాజు, యర్రంశెట్టి శివకృష్ణ, కారుమూరి సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి : సిఐ

నరసాపురం : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని నరసాపురం రూరల్ సిఐ జి.దుర్గాప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. వాహనదారుల ప్రతి ఒక్కరూ రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డుపైకి ద్విచక్ర వాహనం వస్తే తప్పనిసరిగా హెల్మెట్ తోనే రావాలన్నారు. లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడిపితే కేసులు తప్పవని హెచ్చరించారు.

నరసాపురం : సిఐ

పెనుగొండ : మండలంలోని రూరాలి వాహనదారులకు జాతీయ భద్రతా మాసోత్సవం సందర్భంగా నెల రోజులుగా అవగాహన కల్పిస్తున్నట్లు పెనుగొండ ఎస్ఐ కె.గంగాధర్ తెలిపారు. ఆదివారం బజార్ రోడ్డులో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

పేద ప్రజలకు ట్రస్ట్ సాయం

కాళ్ల : దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు బియ్యం, తాగునీటిని ఆదివారం అందించారు. కాళ్లకూరు గ్రామ సోమరాజు గరువులో పోదివారు ప్రసన్నకుమార్ కుమార్తె మొదటి పుట్టినరోజు సందర్భంగా దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ దాట్ల వెంకటరామరాజు 500 మీటర్ల ఆర్వో వాటర్ అందజేశారు. దానరపేటలో ఒలుపు రాంబాబు 11వ రోజు కార్యక్రమానికి డాక్టర్ దాట్ల వెంకట రామరాజు ముందుకు వచ్చి రెండు బస్తాల బియ్యం, 500 లీటర్ల ఆర్వో వాటర్ అందజేశారు.

సామాజిక సేవలు విస్తృతం చేద్దాం

మొగల్తూరు : పూర్వ విద్యార్థి సంఘం తరపున సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేద్దామని పాలకొల్లు బిఆర్‌ఎంవిఎంహెచ్ మున్సిపల్ ఉన్నత పాఠశాల 1981 బ్యాచ్ ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ వల్లం గణేశ్ అన్నారు. మండలంలోని ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో 1980-81 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గత 22 సంవత్సరాలుగా క్లబ్ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం ఆత్మీయ సమావేశాలు నిర్వహించుకుంటూ క్లబ్ సభ్యుల నిధుల సహాయం ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం క్లబ్ తరపున సంఘం కార్యదర్శి కె.వి.సాంబశివరావు, కోశాధికారి గిరిజాల శ్రీనివాస్, సంఘ ప్రతినిధులు పిల్లా శ్రీనివాస్ ఉన్నారు.

వాడవాడలా గణతంత్ర దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పట్టణంలో 76వ గణతంత్ర వేడుకలు పట్టణంలో ఆదివారం జరిగాయి. మున్సిపల్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం, ఎంపిడిఒ కార్యాలయంతో పాటు పలు కళాశాలలు, స్కూళ్లలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, ఎంఎల్ఎ అంజిబాబు గణతంత్ర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, గంటా త్రిమూర్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, జిల్లా, మండల పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, పంచాయతీ, ప్రయివేట్ సంస్థల వద్ద ఆదివారం ఉదయం వేడుకలు జరిగాయి. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ వై.రవికుమార్ పతాక ఆవిష్కరణ చేశారు. డిప్యూటీ తహశీల్దార్ ఎమ్‌వియమ్మ, సీనియర్ అసిస్టెంట్ కె.సుబ్బారావు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. బ్రాహ్మణ చెరువులోని వ్యవసాయ, విద్యా శాఖ, ఇంజినీరింగ్, పోలీస్ కార్యాలయాల్లో అధికారులు పతాక ఆవిష్కరణ చేశారు. నెగ్గిపూడి (మార్టేరు) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్, శాస్త్రవేత్తలు డాక్టర్ కృష్ణాజి పాల్గొన్నారు.

కాళ్ల : గణతంత్ర దినోత్సవ వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కలవపూడి, పెదఅమిరం, ఏలూరుపాడు, జువ్వలపాలెం, దొడ్డనపూడి, కాళ్ల, పలుగ్రామాల్లో, పలు ప్రభుత్వ కార్యాలయాల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆయా గ్రామ పంచాయతీల వద్ద జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ వేడుకల్లో పెదఅమిరం గ్రామ సర్పంచి డొక్కుసోమేశ్వరరావు, కలవపూడి గ్రామ సర్పంచి గేదల జాన్, ప్రాతళ్లమెరక గ్రామ సర్పంచి కంతేటి ఉష శ్రీనివాసరాజు, ఉప సర్పంచి కంతేటి చంద్రావతి సుబ్బరాజు, గ్రామ సర్పంచి బోనం భాగ్యశ్రీ శివకుమార్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : సామాన్యులు సైతం ఎన్నికల్లో పోటీ చేసేలా రాజ్యాంగం ద్వారా హక్కు కల్పించిన మహానీయుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం తాడేపల్లిగూడెం పురపాలక సంఘం, తహశీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాల వద్ద నిర్వహించిన గణతంత్ర వేడుకలలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎపి నిట్‌లో, బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మండల లీగల్ సర్వీసెస్ ఛైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాష పాల్గొన్నారు. అనంతరం శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాల, శశి ఇంజనీరింగ్ కళాశాలలో గత నెలలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, భారత రాజ్యాంగ పుస్తకంను జిల్లా జడ్జి సికిందర్ భాష చేతుల మీదుగా అందజేశారు.

ఆచంట : ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలో కళాశాల వద్ద జాతీయ జెండాలను ఎగరవేశారు. ఆచంట తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో తహశీల్దార్ జి.కనకరాజు జాతీయ జెండాను ఎగరవేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ

పాలకొల్లు : జాతీయ నాయకు వేషధారణలో మాంటిస్సోరిస్ విద్యార్థులు

పూర్ణ బాబ్జి, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ కె.వెంకటరమణ జాతీయ జెండాలను ఎగరవేశారు. మండలంలో ఆచంట కొడమంచిలి, కోడేరు పెదమల్లం, భీమలాపురం, కరుగోరుమిల్లి, కదరవల్లి, పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు గ్రామాల సర్పంచులు జాతీయ జెండాలు ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కోట సరోజిని, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా దేశ నాయకులు డాక్టర్

ఆకివీడులో జెండా ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం

బిఆర్.అంబేద్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పుష్పాలను సమర్పించి, అంజలి ఘటించారు. తరువాత త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు, ఎంఇఒ శర్మ, ఇఒపిఆర్‌డి మూర్తి బాబు, ఎఒ రామదాసు నాయుడు పాల్గొన్నారు. సగం చెరువు, కొత్తపేట, దిగమర్రు, ఆగరు గోరింటాడా గ్రామాలలోని సచివాలయాల వద్ద గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచులు కడలి నాగమణి, కౌరు భారతీయ భాస్కరరావు, రాపాక నగేష్ కరుణాకర్, మండేల పావని నాని పాల్గొన్నారు.

గణపవరం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మి జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వైవి.అప్పారావు, ఇఒపిఆర్‌డి పల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. గణపవరం డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి జెండా ఆవిష్కరించారు. సిఐ కార్యాలయం వద్ద నిడమర్రు సిఐ సుభాష్ పతాకాన్ని ఆవిష్కరించారు. కన్యాకాపరమేశ్వరి వర్తకసంఘం భవనం వద్ద రుద్రరాజు ఫౌండేషన్ అధ్యక్షులు ఆర్‌విఎస్ .రాజు జెండాను ఎగురవేశారు. పంచాయతీ వద్ద సర్పంచి మూరా అలంకారం జెండాను ఆవిష్కరించారు. పిప్పర పంచాయతీ వద్ద సర్పంచి కాకర బేబి జెండా ఎగురవేయగా పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర పాల్గొన్నారు. కేశవరం, మొయ్యేరు, కాశిపాడు, అప్పన్నపేట, ముప్పర్తి పాడు, సిహెచ్ అగ్రహారం, జల్లికాకినాడ, కొమ్మర, కోమర్రు, ఎస్.కోండేపాడు, డికేవల్లి సరిపల్లి పంచాయతీలలో ఆయా గ్రామ సర్పంచులు చలుమూరి లక్ష్మీ భవాని, మిడతాని వెంకటలక్ష్మి, బాతు నాగేశ్వరరావు, కర్రిరాధ జెండాను ఆవిష్కరించారు.

పాలకొల్లు : పాలకొల్లు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ విజయ సారధి రిపబ్లిక్ డే సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. పాలకొల్లు తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ యడ్ల దుర్గా కిషోర్, పోలీస్ కార్యాలయం వద్ద పట్టణ సిఐ కె.రజనీ కుమార్ జెండా ఆవిష్కరణ చేశారు. ఎస్ఎస్ఎంఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి, డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద ప్రిన్సిపల్ డాక్టర్ శోభా రాణి, చాంబర్స్ డిగ్రీ కళాశాల వద్ద ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వరరావు సారథ్యంలో చాంబర్స్ ఎడ్యుకేషన్ కమిటీ సభ్యులు, కోకోనట్ మర్చెంట్స్ సంఘం వద్ద ఛాంబర్ ప్రధాన కార్యదర్శి కతారి నాగేంద్ర కుమార్ జెండా ఆవిష్కరించారు. కాంగ్రెస్ కార్యాలయం వద్ద పట్టణ అధ్యక్షులు యడ్ల శివాజీ అధ్యక్షతన, ప్రెస్ క్లబ్ వద్ద మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, మాంటిస్సోరి హైస్కూల్ వద్ద డైరెక్టర్ కెవి.కృష్ణవర్మ సారథ్యంలో, లయన్స్ క్లబ్ వద్ద అసిస్టెంట్ గవర్నర్ ఎన్‌విఎస్.పాపారావు నాయుడు సారథ్యంలో జెండా ఆవిష్కరించారు.

ఆకివీడు: మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యాలయాధికారి శ్రీకర్, నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ కృష్ణమోహన్, మండల రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుజాత, పలు విద్యాసంస్థల్లో ఆయా సంస్థల ప్రధానోపాధ్యాయులు జెండాను ఆవిష్కరించారు.

ఉండి: నియోజకవర్గ కేంద్రమైన ఉండిలో ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ స్థూపాల వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ పార్లమెంట్ సభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ జిల్లా అధ్యక్షులు పాతపాటి హరి రామ కుమార్ రాజు, నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జ్ వేగేశ్న వెంకట గోపాలకృష్ణరాజు, పార్టీ మండల అధ్యక్షులు వారాడ గోపాలరావు పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, పాఠశాలల వద్ద ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాని, రెవెన్యూ కార్యాలయం వద్ద తహశీల్దార్ కె.రాజకిషోర్, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ జి.వాసు, విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ఎఇ ప్రభాకర్ రావు, మొగల్తూరులోని పంచాయతీ వద్ద కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు, పెనుమత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో వర్ధమాన రవిశంకర్ సర్కార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

నరసాపురం: సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డిఒ దాసిరాజు జెండా ఆవిష్కరించారు. అనంతరం గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. నరసాపురం జలవనరుల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో ఇరిగేషన్ డిఇఇ సిహెచ్.వెంకట్ నారాయణ, విద్యుత్ శాఖ ఇఇ కార్యాలయంలో ఇఇ కె.మధుకుమార్, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో బిజిబిఎస్ మహిళ కళాశాలలో జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది.

పెనుగొండ : మండల, ప్రభుత్వ కార్యాలయాల్లో స్కూల్, కాలేజీలో ఎంపిడిఒ ఆధ్వర్యంలోని పలు డిపార్ట్మెంట్‌ల అధికారులు, సిబ్బంది జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సూర్యనారాయణ మాట్లాడారు. విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

సాగర తీరం.. కోలాహలం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు ఉదయమే తరలివచ్చారు. పలువురు సముద్ర కెరటాలలో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకు వస్తున్న కెరటాలతో, ఇసుక తిన్నెలపై ఆటలు ఆడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని, సరివి కొబ్బరి తోటలలో సహపంతి భోజనాలు చేసి సేద తీరారు.

బీచ్‌లో పర్యాటకుల సందడి

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ఆచంట : పోటీ ప్రపంచంలో విద్యార్థులు విలువైన పుస్తకాలను చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వల్లూరు ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ నరసింహ అన్నారు. మండలంలోని కొడమంచిలి, ఆచంట, వల్లూరు, కోడేరు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో గత విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అచీవర్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు ఉపయోగపడే విలువైన పుస్తకాలను సభ్యులు అందజేశారు. 2019 నుంచి క్రమం తప్పకుండా అచీవర్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పుస్తకాలను అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అచీవర్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


భీమవరం టౌన్ : ఏసుబాబు

తాడేపల్లిగూడెం ఎంపిడిఒ


పెనుమంట్ర : జూనియర్ అసిస్టెంట్ ఉదయకిరణ్

యలమంచిలి భ్రమరాంబ

గణపవరం ఇఒపిఆర్‌డి


తణుకు రూరల్ తహశీల్దార్



కాళ్ల : వైద్యాధికారి సునీల్

మొగల్తూరు అవార్డు అందుకుంటున్న సత్య మనోజ్ఞ


పెనుమంట్ర : ఆర్‌టిసి డిపో మేనేజర్

ఆచంట : ఎస్ఐ

ఉండి : ఎస్ఐ

ఉత్తమ సేవలకు పురస్కారాలు

ప్రజాశక్తి - ఆచంట

76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆచంట ఎస్ఐ కె.వెంకటరమణ జిల్లా కలెక్టర్ చేతులమీదుగా ఉత్తమ అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నారు. ఎన్‌టిఆర్ వైద్య సేవా జిల్లా బెస్ట్ ఎంప్లాయ్ అవార్డును వల్లూరు గ్రామానికి చెందిన డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవ డివిజనల్ టీం లీడర్ చిట్టూరి రాంబాబు అందుకున్నారు.

గణపవరం : మండలంలోని పంచాయతీ రాజ్ శాఖలో అత్యంత సేవలందించిన గణపవరం మండలపరిషత్ ఇఒపిఆర్‌డి పల్లి సత్యనారాయణ కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. సత్యనారాయణకు ఉత్తమ అవార్డు వచ్చినందుకు ఎంపిడిఒ బేబిశ్రీలక్ష్మి, ఎంపిపి దండు వెంకటరామరాజు అభినందనలు తెలిపారు.

భీమవరం టౌన్ : ప్రముఖ తారకరామా కన్స్ట్రక్షన్ అధినేత, గ్రేడ్ వన్ కాంట్రాక్టర్ పళ్ల ఏసుబాబు బెస్ట్ క్వాలిటీ అవార్డు కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఏసుబాబు ప్రజాశక్తితో మాట్లాడుతూ లబ్ధిదారులు ఆనందపడేలా నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అవార్డు ప్రధానం చేసిన అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

తణుకు రూరల్ : మండల తహశీల్దార్ డివివిఎస్ అశోక్ వర్మ ఉత్తమ సేవల ప్రశంసను అందుకున్నారు. డిప్యూటీ తహశీల్దార్ ఎన్.శ్రీదేవి, ఎలక్షన్ డిటి ఎస్.శివశంకర్, ఆర్ఐ పి.గౌతమి, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, రేషన్ డీలర్లు ఆయనను అభినందించారు. తణుకు ఎక్సైజ్ సిఐకి ఎస్.మణికంఠ రెడ్డి ఉత్తమ సేవల ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. ఎక్సైజ్ ఎస్ఐలు ఆర్.మధుబాబు, బి.లక్ష్మి, సిబ్బంది సిఐను అభినందించారు.

పెనుమంట్ర : పెనుమంట్ర పోలీస్ స్టేషన్ ఎస్ఐ కె.స్వామి, నరసాపురం ఆర్‌టిసి డిపో మేనేజర్ సత్తి సుబ్బన్న రెడ్డి, అత్తిలి మండలంలోని పాలి విఆర్ఒ.భూపాతిరాజు రవీంద్ర రాజులు ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. వీరిని ప్రముఖులు అభినందించారు.

కాళ్ల : కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్‌కి ఉత్తమ వైద్యాధికారి అవార్డును కలెక్టర్ నాగరాణి, జిల్లా వైద్య శాఖాధికారి బి.భాను నాయక్‌ల చేతుల మీదుగా అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. అవార్డు గ్రహీత డాక్టర్ సునీల్ మాట్లాడుతూ మరికొంతమంది దాతలు ముందుకు వస్తే పిహెచ్‌సిని అభివృద్ధి చేస్తూ మరిన్ని సేవలు ప్రజలకు అందిస్తానన్నారు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం పట్టణ సిఐ ఎ.సుబ్రహ్మణ్యంకు విశిష్ట సేవా ప్రతిభ పురస్కారం, ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వహించిన జిల్లా ఉత్తమ ఎంపిడిఒగా ఎం.విశ్వనాథ్, జిల్లా ఉత్తమ ఇఒపిఆర్‌డి టి.వెంకటేష్ బాబు, జిల్లా ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా టి.రవిచంద్ర, ఉత్తమ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐగా ఆర్.దొరబాబు ఆదివారం భీమవరంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ నాగరాణి, ఎస్‌పి, జెసి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

మొగల్తూరు : మండలంలోని పలువురు ప్రభుత్వ ఉద్యోగులకు కలెక్టర్ నాగరాణి ఆదివారం ఉత్తమ సేవా పురస్కారాలు అందజేశారు. ఉపాధి హామీ చట్టం మండల ఇన్‌ఛార్జి ఎపిఒ జవ్వాది వెంకటేశ్వరరావు, కేపీ పాలెం నార్త్ సచివాలయ సర్వేయర్‌గా ఉత్తమ సేవలు అందించిన బొబ్బిలి శ్రీనువాసులు పురస్కారాలు అందుకున్నారు.

ఉండి: ఉండి పోలీస్ స్టేషన్‌లో హోంగార్డ్‌గా పనిచేస్తున్న నెల్లి కుమార రత్నం ఉత్తమ అవార్డును కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఉండి ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా మాట్లాడుతూ మండలంలోని యండగండి గ్రామంలో డెడ్ బాడీ డోర్ డెలివరీ కేసును విజయవంతంగా ఛేదించడంలో భాగస్వామి అయిన నెల్లి కుమార రత్నంకు ఉత్తమ అవార్డు లభించడం ఆనందదాయకమని ఈ సందర్భంగా రత్నంకు స్టేషన్ తరపున అభినందనలు తెలిపారు.

మొగల్తూరు : వీర గాథ 4.0 వ్యాసరచన పోటీలలో ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన డి.సత్యమనోజ్ఞ రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా మనోజ్ఞకు ఆదివారం విజయవాడలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో స్టేట్ సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నట్లు హెచ్‌ఎం పి.రామరాజు తెలిపారు. ఈ సందర్భంగా మనోజ్ఞను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

నరసాపురం : నరసాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి దాసిరాజుకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. కలెక్టర్ నాగరాణి చేతుల మీదగా అవార్డు, మెమొంటోను అందుకున్నారు. రెవెన్యూ శాఖలో ఉత్తమ సేవలకు గాను ఈ అవార్డును అందుకున్నారు.

యలమంచిలి : మండలంలోని కొంతేరు గ్రామానికి చెందిన గుమ్ములూరి లక్ష్మీ భ్రమరాంబకు ఉత్తమ ఉపాధ్యాయ స్పెషల్ కేటగిరి అవార్డును కలెక్టర్ నాగరాణి, జెసి రాహుల్ కుమార్ రెడ్డి అందజేశారు. గ్రామీణ ప్రాంతాలలో ఉత్తమ విద్యతో పాటు వివిధ సామాజిక సేవలు అందించినందుకు ఈ అవార్డుని అందజేశారు.

ఆగస్టు 15కు ఆర్ఒబి ప్రారంభం

మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు

ఉండి : 2025 ఆగస్టు 15వ తేదీ నాటికి ఉండి రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్ఒబి) ప్రారంభం కానుందని మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఉండిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల వైఫల్యం, మరికొన్ని కారణాల వల్ల ఉండి రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు గత రెండు సంవత్సరాలుగా నిలిచిపోయాయన్నారు. దీనిపై తాను అనేక దపాలుగా రైల్వే చీఫ్ ఇంజనీర్, ఇతర అధికారులతో మాట్లాడానని చెప్పారు. అయితే ప్రస్తుతం నూతన కాంట్రాక్టర్ ఒప్పందం కుదిరిందని, ఆ పనులు కొలిక్కి వచ్చాయని ఆయన తెలిపారు. త్వరలో ఉండి ఆర్ఒబి పనులు ప్రారంభమవుతాయని బాపిరాజు తెలిపారు. త్వరితగతిన ఆర్ఒబి పనులను పూర్తి చేసి వచ్చే ఆగస్టు 15వ తేదీ నాటికి ప్రారంభించి వినియోగంలోకి తీసుకువచ్చే అవకాశం ఉందని ఆయన వివరించారు. ఈ సమావేశంలో పిసిసి జిల్లా అధ్యక్షులు పాతపాటి హరికుమార్ రాజు, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి వేగేశ్న గోపాలకృష్ణ రాజు, పిసిసి మాజీ అధికార ప్రతినిధి సోడదశి గంగయ్య ఉన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న సిఐలు దుర్గాప్రసాద్, యాదగిరి

దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తుల అరెస్ట్

ప్రజాశక్తి - నరసాపురం

పలు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న దొంగలను అరెస్ట్ చేసినట్లు నరసాపురం టౌన్, రూరల్ సిఐలు బి.యాదగిరి, జి.దుర్గాప్రసాద్‌లు తెలిపారు. ఆదివారం రాత్రి పట్టణ పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐలు మాట్లాడుతూ మొగల్తూరు పట్టణ స్టేషన్ పరిధిలో గత ఏడాది 4 ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న కాకినాడ జిల్లాకు చెందిన కొండపల్లి అరుణ్ కుమార్, తూర్పుగోదావరి జిల్లా మట్టపర్తి రాజ్ కుమార్‌లను శనివారం రాత్రి పట్టణంలోని స్టీమర్ రోడ్ వైఎస్ఆర్ విగ్రహం వద్ద అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 50 గ్రాముల బంగారం, 150 గ్రాముల వెండి, ఒక లాప్ ట్యాప్, రూ.5 వేల నగదును స్వాధీన పరుచుకున్నారు. వీరు తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా ఖానాపూర్ హవేలి పోలీసు స్టేషన్ పరిధిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్ కూడా వారు దొంగతనం చేసినట్లుగా దర్యాప్తులో అంగీకరించారని తెలిపారు. ఈ సమావేశంలో టౌన్ ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి, మొగల్తూరు ఎస్ఐ జి.వాసు, కానిస్టేబుల్స్ పి.పుల్లారావు, వేణు పాల్గొన్నారు.

విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీ

ఆకివీడు : రిపబ్లిక్ డే సందర్భంగా నెల్లి కృష్ణమూర్తి, సూర్యకాంతం మెమోరియల్ ఆధ్వర్యంలో బాలోత్సవ్ కమిటీ, లియో క్లబ్ సంయుక్తంగా విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు. విజేతలకు స్థానిక మాదివాడ శాఖ గ్రంథాలయంలో బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ ఛైర్మన్, ప్రముఖ ఇంజనీర్ దాసరి వెంకట సత్యనారాయణ, అడ్వకేట్ నెల్లి సతీష్ కుమార్, బాలాదిత్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నెల్లి దుర్గాప్రసాదరావు, వరలక్ష్మి దంపతులు, నెల్లి సత్యనారాయణ, గ్రంథాలయ పాలకురాలు కె.పార్వతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. పాటల పోటీల్లో ధన్యశ్రీ ప్రథమ స్థానం, విజయదుర్గ ద్వితీయ స్థానం, ధనుశ్రీ తృతీయ స్థానం సాధించారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

భీమవరం టౌన్ : సమాజ సేవలో అందరూ భాగస్వాములు కావాలని, విద్యాదానం అన్ని దానాలలో కెల్లా ఎంతో గొప్పదని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. మండలంలోని వెంప గ్రామంలో గొట్టుముక్కల సుబ్బరాజు మెమోరియల్ ట్రస్ట్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా 53 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలను ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి ప్రాంగణంలో అంజిబాబు చేతుల మీదుగా అందించారు. అంజిబాబు మాట్లాడుతూ గొట్టుముక్కల భీమరాజు గత ఏడాది 27 మంది విద్యార్థులకు రూ.3 లక్షల ఉపకార వేతనాలు అందించారని, ఈ ఏడాది 53 మంది విద్యార్థులకు రూ.6 లక్షల 50 వేల ఉపకార వేతనాలు అందించడం గొప్ప విశేషమని అన్నారు. ట్రస్ట్ ఛైర్మన్ గొట్టుముక్కల భీమరాజు పాల్గొన్నారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం
2nd Additional Junior
సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 447/2023

Between:
State Bank of India, Tadepalligudem
...Plaintiff
Gujju Lakshminarayana and another
...*Defendant*

To
Gujju Lakshminarayana,
S/o. Venkateswararao,
Door No.4-150-12, Weakers Colony,
Tadepalligudem TPG JCJC

పై నెంబరు దావాలో 1వ ప్రతివాదికి ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను దావా సంగతులు తెలిసి యుండి సదరు సమన్లు తీసుకొనకుండా evade చేయుచున్నందున Substitute of Service ద్వారా అమలు జరుపుటకు ఉత్తర్వులు యిచ్చి **ది.07-02-2025వ తేదీకి** వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరు వాయిదా రోజున **ఉదయం గం. 10-30 ని.లకు** పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమందు పై నంబరు దావా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

PASUPULETI SRINIVAS
Tadepalligudem — Advocate for plaintiff
Date: 20-01-2025 — Tadepalligudem

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99180
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814